
# తడిమనసు



సాయంత్రం అయిదున్నర.

మునిసిపల్ పార్కులో ఒక మూలగా సిమెంటు బెంచీ మీద కూర్చున్నాను.

ఈ పెద్ద పట్టణానికి కొత్తగా బదిలీ అయి వచ్చిన తరువాత మొట్టమొదటిసారిగా పిల్లలు పట్టుపడితే, వాళ్లను వెంటబెట్టుకుని ఉత్సాహంగా ఈ పార్కుకు తీసుకొచ్చాను. కాస్సేపు పార్కులో ప్రశాంతంగా గడపొచ్చనే ఊహ కూడా నా ఉత్సాహాని కి ఊపిరి పోసింది. తీరా పార్కులో అడుగుపెట్టిన తరువాత నా ఉత్సాహం నీరుగారిపోయింది.

పార్కులో జనం పలచగానే ఉన్నా, పార్కు చుట్టూ ఉన్న వాతావరణం మహా గోలగా గందరగోళంగా ఉంది. సినిమా రోడ్డుకు పక్కనే ఉన్న చిన్న మునిసిపల్ పార్కు. ఇది పార్కుకు మూడు వైపులా మూడు సినిమా హాళ్లున్నాయి. మూడు సినిమా హాళ్ళ ముందు పెను కేకలతో టిక్కెట్ల కోసం సగటు జనాభా చేస్తోన్న పోరు ఎదురుగా రెండు ఇరానీ హోటళ్ల తాలూకు స్టీరియో మైకుల సినిమా పాటల హోరు, రోడ్డు మీద రొదతో పరుగెడుతూన్న వాహనాల జోరు. ఈ మహా

పట్టణంలో పార్కుకొచ్చి ప్రశాంతత వెతుక్కోవడం అన్న ఊహ ఎంత పిచ్చిదో నాకప్పుడే అర్థమయింది.

పార్కులో ఉన్న అయిదారు బెంచీల్లో ఎక్కువగా రిటైరయి, వయసు పైబడిన వాళ్లే ఉన్నారు. కొంతమంది మునిసిపల్ ఉద్యోగులు పచ్చికలో చతికలపడి కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇద్దరు కుర్రాళ్లు బెంచీ మీద కాళ్లు బార చాపుకుని కులాసాగా సిగరెట్లు కాలుస్తున్నారు. వీళ్లు కాక, పార్కుకు ఒక మూల ముష్టివాళ్ల గుంపు ఉంది. ఆ గుంపులోంచి గంజాయి వాసన ఘాటుగా గాలి లోంచి తేలి వస్తోంది. పార్కులో చిన్న పిల్లలు ఎవ్వరూ లేరు. మా పిల్లలు కవిత, వంశీలు ఇద్దరూ ఈ వాతావరణానికి అతీతంగా పార్కు మధ్య వెలిసిపోయిన గాంధీగారి శిలా విగ్రహం చప్టా చుట్టూ పోటీగా తిరుగుతున్నా రు. పకపకమని నవ్వుకుంటున్నారు. వాళ్ల లోకం వాళ్లది. వాళ్ల ఆనందం వాళ్లది.

పార్కును, పార్కులోని మనుషుల్ని వాతా వరణాన్ని పరిశీలనగా చూస్తున్న నాకు ఎదురుగా కొంచెం దూరంలో, సిమెంటు బెంచీ చివరగా కూర్చున్న వ్యక్తి ఎందుకో వింతగా కనిపించాడు.

ఆ బెంచీ మీద ముగ్గురు వ్యక్తులు కూర్చున్నారు. ఒక వ్యక్తి చేతిలో ఉన్న దినపత్రిక చదువుతున్నాడు. చదువుతూ రాజకీయాల్ని పెద్ద గొంతుతో వాఖ్యానిస్తున్నాడు. మధ్యగా కూర్చున్న వ్యక్తి తల ఊపుతూ మధ్య మధ్యలో తన అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నాడు. వీళ్ళకు ఎడంగా బెంచీ చివర కూర్చున్న వ్యక్తి బక్కగా ఉన్నాడు. బట్టలు మాసి ఉన్నాయి. గడ్డం పెరిగి ఉంది. పొడుగు చేతుల చొక్కా, షరాయి వేసుకున్నాడు. వయసు ఏభై యేళ్ల పైనే ఉండొచ్చు. అదే బెంచీ మీద కూర్చున్న రాజకీయ మిత్రుల మాటల్లో తనూ మాట కలపడానికి ప్రయత్నిస్తున్నాడు. మాట మాటకు ముఖం అంతా నువ్వు పులుముకుంటు న్నాడు. ఏదో గొణుగుతున్నట్టుగా తనలో తానే మాట్లాడుకుంటున్నాడు.

ఆ బెంచీ మీద కూర్చున్న యిద్దరు వ్యక్తులూ, బక్కగా ఉన్న ఆ మనిషితో అసలు మాట్లాడడం లేదు... కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఆ బెంచీ మీద మరో వ్యక్తి ఉన్నాడన్న స్పృహ వాళ్లకు ఉన్నట్లు లేదు. బక్కగా ఉన్న వ్యక్తి ఏమనుకున్నాడో భారంగా పైకి లేచాడు. ఆలోచిస్తున్నట్టుగా అడుగులో అడుగు వేస్తూ మరో బెంచీ వద్దకు వెళ్లాడు. నవ్వుతూ ఆ బెంచీ మీద వాళ్లను పలకరించాడు. అభ్యర్థనగా ఏదో అడిగాడు. వాళ్ళు ఇతడి వైపు చూడలేదు. అయినా అతను చిన్నబుచ్చుకున్నట్టు లేదు. అక్కడ పచ్చికలో కాస్సేపు కూర్చున్నాడు. పార్కంతా అటూ ఇటూ కలయచూశాడు.

తిన్నగా నావైపు నడిచి వచ్చాడు. నేను కూర్చున్న బెంచీ చివర ఒదిగి కూర్చున్నాడు. నా ముఖంలోకి చూస్తూ ఓ వెర్రి నవ్వు విసిరాడు. అతనలా ఆ బెంచీ మీదకు వచ్చి కూర్చోవడం నాకూ అసహనంగా ఉంది. ఏదో తెలియని చికాకు చుట్టుముట్టింది. పార్కులో ప్రశాంతంగా కాస్సేపు గడుపుదామని వస్తే ఈ మనిషి నా ప్రక్కకు చేరేడేమిటి ? నేను ముఖం అటు త్రిప్పుకున్నాను.

పిల్లలిద్దరూ గాంధీ గారి విగ్రహం దగ్గర చిన్న చిన్న రాళ్లు ఏరుకుంటూ ఆడుకుంటున్నారు.

'కవితా ! వంశీ ! మట్టిలో చేతులు పెట్టకండి!' వాళ్లవైపు చూస్తూ గట్టిగా కేక పెట్టాను.

"హిహిహి... మీ పిల్లలాండి ! ముచ్చట గున్నారయ్యా. బాబు మరీ ఉషారుగా పరుగెడుతున్నాడు'' అతను తెచ్చి పెట్టుకున్న నవ్వుతో చనువుగా అన్నాడు.

నేను మాట్లాడలేదు. అతనితో మాట్లాడడానికి మనసు అసలు సుముఖంగా లేదు. అయినా ఆ వ్యక్తి నన్ను వదిలి పెట్టలేదు.

"మీది ఈ ఊరే నాండి ? ఎందులోనన్నా కొలువు సేస్తన్నారా ?''

"ఈ ఊరే ! టెలిఫోన్సులో ఉద్యోగం," తప్పదు అన్నట్టుగా జవాబు చెప్పాను.

ఈ మాత్రం జవాబుకే, ఆ మనిషి ముఖం

ఇంత చేసుకున్నాడు. సిమెంటు బెంచి మీద నా క్కొంచెం దగ్గరగా జరిగాడు. ఆ వ్యక్తి నుంచి ఏదో వాసన వస్తోంది. ఆ వాసన నాకు వికారం తెప్పించేటట్లుగా ఉంది. లేచి వెళ్లిపోతే బావుంటుం దేమో ! ఒక నిర్ణయానికొచ్చి ఇబ్బందిగా కదిలాను.

"డాడీ ! ఎవరా బూచోడు ?" అయిదేళ్ల వంశీ నా దగ్గరకు రాబోయి భయం భయంగా అడిగాడు.

"నాను బూచోడ్ని కాదు నాయనా ! నిన్నేమీ భయపెట్టనులే. రా ! ఇలారా!" అతను వంశీ వైపు చేతులు చాచాడు.

వంశీ దగ్గరకు రాలేదు. తన అక్కతో ఆడుకోవడానికి వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు.

"మాది సాలూరి దగ్గిర చిన్న పల్లెటూరయ్యా. నా పేరు సింవాచలం." ఏదో చెప్పాలన్న తాపత్రయం అతని ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

నాలో అసహనం పెరిగిపోతూంది.

"నీ వూరూ, పేరూ ఎవరడిగారు ? నువ్వేదో కధ చెప్పాలనుకుంటున్నావు కదూ ! నీ కథ వినడానికి నేను సిద్ధంగా లేను. వెళ్ళు !" గొంతు వరకు వచ్చిన మాటలు ఎందుకో బయటకు రాలేదు.

"ఒటేల్లో సర్వరుగా పనిచేస్తన్నానండి... రెండు పూటలా టిపిను తినొచ్చునండి. భోజనానికి లోటు నేదండీ ! పైగా రోజు అయిదు రూపాయలు చేతికిస్తున్నారండి. అయిదు రూపాయలు పైఖర్చుకు సరిపోతయ్యండి. ఏటిసేస్తానండీ ! పగలంతా పన్జేసి రాత్రులు ఆ స్టోరు గది ముందే పడుకుండి పోతానండి. కష్టమో, సుఖమో" సింహాచలం ఆగకుండా, ఆత్రంగా తన కథ చెప్పుకుపోతున్నాడు.

"అంత దూరంనుంచి, ఈ ఊరెందు కొచ్చావు నువ్వు ? ఈ సర్వరు పని ఆ చుట్టు పక్కల ఊళ్లోనే చేసుకోవచ్చుగా ?"

సింహాచలం మాటల్ని మధ్యలోనే త్రుంచి అయిష్టంగానే అడిగాను. అతడ్ని 'మీరు' అని సంబోధించడానికి ఎందుకో మనస్కరించలేదు.

"ఒకప్పుడు దర్జాగానే బతికినానయ్యా. దగా పడిపోయినాను. పుట్టి పెరిగిన ఊళ్లో కట్టెలమ్ము కోనేక, దారినేక విజీనగరంలో బండెక్కి ఇంత దూరం వచ్చి పడిపోయినానయ్యా." సంహాచలం కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అతని గొంతు దాద్గదికమయింది. జీర పెరిగి పెద్దదయి దగ్గు తెర గొంతుకు అడ్డం వచ్చేసింది.

అతని మాటలు వినడం మొదలు పెట్టి నేనేదో ఇరుకున పడ్డట్టయింది. పూర్తిగా వినడమా, వెళ్ళిపోవడమా ?

భార్యా బిడ్డలు ఎవరూ లేరా నీకు ?" అడగకూడదనుకుంటూనే అడుగుతున్నాను.

"ఆడదానికి కేన్సరు రోగమొచ్చి కన్ను మూసినాదయ్యా. అది పోయాక నాది మరీ అనాధ బతుకయిపోయినాది. ముగ్గురు కొడుకులయ్యా. ఇద్దరు కూతుళ్ళున్నారయ్యా. పెద్ద కొడుకేమో 'గంజి నాను పోయను, గడప ఎక్కొద్దూ !' అనేసినాడయ్యా. చిన్న కొడుకు అయ్యా నన్న మాట కూడా మరిసిపోయ్యి, సాచిపెట్టి సెంప మీద కొట్టేసినాడయ్యా. ఆఖరి కొడుకు మంచోడయ్యా. కానీఏటి నాబం ? కోడలు పిల్ల ఆడి మంచితనాన్ని కొరుక్కు తినేసినాదయ్యా. కూతుళ్లు నాతో మాట్టాడరయ్యా. అల్లుళ్ళకి నా అవుసరం నేదయ్యా. నా కొంపా, గోడు, ఆరెకరాల బీడు సావుకారు మింగేసినాడయ్యా. నాకేటి మిగిలినాదయ్యా ఆ ఊళ్ళోల ? నాకెవురున్నారయ్యా ఈ పెపంచకంలో? సెప్పండి బాబూ సెప్పండి."

సింహాచలం ఆవేశపడిపోతున్నాడు. ఆవేశంతో బాటు అతనిలోంచి దుఃఖం, ప్రవాహంలా పొర్లుకు వచ్చేస్తోంది. కళ్ల నుంచి నీళ్లు జలజలమని రాలిపోతున్నాయి. సింహాలచం నిజంగా ఏడుస్తున్నాడు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు.

క్షణ కాలం నాలో చిన్న కదలిక, మనసు పొరల్లో ఆర్ద్రత... జాలి ! మరు క్షణంలోనే నా బుద్ధి పనిచేయడం మొదలు పెట్టింది.

సింహాచలం నిజంగానే ఏడుస్తున్నాడా ? ఏడుస్తున్నట్టు నడిస్తున్నాడా ? అతను కట్టుకథ చెబుతున్నాడా ? ఆ కథ పరమార్థం ? అవును

సింహాచలం నా నుంచి ఏదో ఆశిస్తున్నాడు. అవసరార్థం అతను కథ అల్లుకుపోతున్నాడు. దీనులు, హీనులు, దౌర్భాగ్యులు మన కళ్ళ ముందు కోకొల్లలు. ఆకలి కోసం మనిషిని మనిషి హత్య చేస్తున్న రోజులివి. సింహాచలం అవసరార్థం ఒక అబద్ధపు కథ చెప్పడంలో ఆశ్చర్యం ఏముంది ?

"ఈ రోజు హోటలు పనికి వెళ్లలేదా ?" గొంతులోకి సాధ్యమైనంత మార్దవాన్ని తెచ్చుకుంటూ అడిగాను.

'లేదయ్యా ! నాల్రోజులుగా పన్లోకెళ్లడానికి ఓపిక సాలడం నేదు. పట్టుమని గుప్పెడు మెతుకులు తింటే కడుపులో నొప్పి నులి తిప్పేస్తున్నాది. దానికి తోడు నాను తిన్నా తినకపోయినా, దగ్గునా పేణాన్ని తినేస్తున్నాది. గవుర్నమెంటు ఆసుపత్రి కెల్లినాను బాబు, నాలుగ్గంటలు ఓపిగ్గా వరండాలో నిలబడితే రెండు తెల్లటి బిళ్ళలిచ్చి, నడు నడవమని నర్సమ్మ నెట్టేసినాది. నా కెవురున్నారు బాబూ ఈ ఊళ్లో ? నా మంచి సెడ్డా ఎవురిక్కావాలి నాయనా ? ఆయిన వాళ్లందరుండి కూడా దిక్కులేని బతుకయిపోనాది గాదా.''

సింహాచలం మళ్లీ ఏడుపు మొదలెట్టాడు.

నాకు మతిపోయింది. ఒకవైపు అదంతా నటనే అనుకుంటున్నా అంత పెద్ద మనిషి చిన్న పిల్లాడిలా ఏడుస్తుంటే చికాగ్గా ఉంది. మరో మాటలో అసహ్యంగా ఉంది !

మొదట నుంచి కష్టాలకూ, కన్నీళ్లకూ ఏడుపులకూ, పెడ బొబ్బలకూ నేను కాస్త దూరంగా ఉంటాను. ఎవరి జీవితాన్ని వాళ్లు అందంగా, హాయిగా, సుఖంగా మలచుకోవాలి. తమకున్న పరిధిలో తెలివిగా సరిదిద్దుకోవాలి. అన్న సిద్ధాంతం నాది. ఏడ్చి కన్నీళ్లు కార్చి కష్టాల్ని ఏకరవు పెట్టుకున్నందుకు వల్ల ప్రయోజనం ఏమిటో నాకు అర్థం కాదు. ఏమైనా ఏడుపునూ, ఏడ్చే వాళ్లనూ నేను భరించలేను.

'ఏడవకండి ! ఏడ్చి ఇప్పుడు చేసేదేముంది?' మొహమాటంగానే అన్నాను.

"ఏడవనయ్యా ! మీరు సెప్పినారు గాదా ! అయినా నానిప్పుడు ఏడ్చి మాత్రం సేసేదేటిలెండి! కాకపోతే కడుపులో బాధ." సింహాచలం ఇంకా ఏదో చెప్పుకుపోతున్నాడు గానీ, అతను ఏడుపు మానేశాడు.

నాకు మనస్సు స్తిమితపడింది. తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

"ఒరేయ్ వంశీ ! కవితమ్మా ! ఇంటికి వెళ్దాం నడవండి'' అల్లంత దూరంలో ఆడుకుంటున్న పిల్లల వైపు చూస్తూ గట్టిగా అరిచాను.

ఈ సింహాచలాన్ని ఎలాగో వదిలించుకుని వెళ్లిపోవాలి. లేకపోతే శిరోభారం పెరగడం ఖాయం. నేను లేవబోయాను.

"కాస్సేపు ఆగండి, డాడీ ! మేము ఆడుకుంటు న్నాం కదా !'' పిల్లలు ఇద్దరూ సంయుక్తంగా గోల పెట్టారు.

లోక వృత్తంపై చీకటి తెరలు తెరలుగా ముసురుకుంటోంది. పార్కులో ఉన్న ఆరు ట్యూబులైట్లలో రెండు లైట్లు మాత్రమే వెలిగాయి.

గంజాయి దమ్ము బాగా ఒంట బట్టిందేమో, ముష్టివాళ్ళ గుంపులోంచి ఎవడో రాగం అందుకున్నాడు. ఆ రాగంలోనూ ఏదో వైరాగ్యం బరువుగా, బాధగా ధ్వనిస్తోంది. ఎదురుగా ఉన్న బెంచీపై నుంచి రాజకీయ మిత్రులు పేపరు మడిచి వెళ్లిపోయారు. పార్కు మధ్య రేడియో గురగుర మంటూనే కాపుడిగిపోయిన కొబ్బరి చెట్లకు ఏ ఎరువు వేయాలో, ఎలా మళ్లీ పూత పూయించాలో తీరిగ్గా చర్చ సాగిస్తోంది.

సింహాచలం నా బెంచీ మీద నుంచి కదల్లేదు. అతను కదలడని నాకు తెలుసు. నా వైపు దీనంగా చూస్తున్నాడు. లోకంలో ఉన్న దు:ఖాన్ని, విషాదాన్ని వైరాగ్యాన్ని తన ముఖ కవళికల్లో ప్రదర్శిస్తున్నాడు. ఏదో తటపటాయిస్తున్నట్టుగా అటూ ఇటూ దిక్కులు చూస్తున్నాడు. చేతి వేళ్లు, విరుచుకుంటున్నాడు. గడ్డం సవరించుకుంటున్నాడు.

సింహాచలం చేష్టల్ని నేను ఓరగా గమనిస్తూనే ఉన్నాను. "మీరేమీ అనుకోకపోతే...'' నసుగుతూ

చేతులు నలుపుకుంటూ, సింహాచలం, సంశయంగా నా ముందులేచి నిలబడ్డాడు.

నేను అనుకునేది ఏముంది ? నా ఊహ నిజమే అయింది. సింహాచలం తన కథ ఎందుకు చెప్పాడో... కన్నీళ్లు ఎందుకు కార్చాడో... వాటి పరమార్థం ఏమిటో నాకు పూర్తిగా అర్థమయింది. వెళ్ళాలి. తక్షణం ఈ చోటు విడిచి వెళ్లిపోవాలి. పిల్లలు పేచీ పెట్టినా సరే, వాళ్లను బలవంతంగానైనా బయటకు తీసుకుపోవాలి.

"ఒరేయ్ పిల్లలూ ! వెళ్దాం నడవండి !" నేను అసహనంగా లేచి అరిచాను.

"బాబూ ! ఈ అయిదు రూపాయలుం చుకొని, పిల్లలకి ఏవైనా కొని పెట్టండి !" సింహాచలం చటుక్కున తన జేబులోంచి అయిదు రూపాయల కాగితం తీశాడు.

ఒక క్షణం... నాలో ఊహించని ఉలికిపాటు నివ్వెరపోతున్న మనసు, నిశ్చేతన స్థితిలో శరీరం. ఏమిటిది ? సింహాచలం డబ్బులివ్వడమేమిటి? 'వద్దు ! వద్దు ! నువ్వు డబ్బులివ్వడమేమిటి ? పిల్లలు ఇంతకు ముందే ఏవో కొనుక్కుని తిన్నారు' గిల్టీగా గొంతు పెగుల్చుకుంటూ అన్నానే కాని నేనింకా తేరుకోలేదు.

"వద్దనకండి బాబూ ! ఇంత పెద్ద పట్టణంలో నా కడుపులో ఉన్న బాధ కరువు తీరా సెప్పుకోడానికి ఒక్క మనిషి కూడా దొరకనేదు... ఈ పార్కులో మీరు నాకు దొరికినారు గాదా. నా కత ఓపిగ్గా విని నన్ను ఓదార్చినారు గాదా. ఏడవటం ఎందుకు సింవాచెలం అన్నారు. ఎంతో ధైర్యం సెప్పినారు. నా కడుపు నిండిపోనాది బాబు, నా నీరసం, నిస్సత్తువా ఎగిరిపోయినాయిదయి. అయినోళ్లం దరున్న అనాథ బతుకు నాది. మనిషికి మనిషి తోడు ఎంత బలాన్నిస్తద్ది బాబూ ! నా కెవురూ లేరన్న ఒంటరితనం ఎంత దిగు కలిగిస్తది నాయనా! మిమ్మల్ని నా కొడుకుల్తో పోల్సుకోను. మీరు నాకేమీ కారు. కాని నా ఆత్మకి మీరు బంధువులు గాదా ! మీ పిల్లలకి నేను తాతని అనుకోండి. ఈ డబ్బుల్తో ఏవైనా కొనిపెట్టండి బాబు. నాకీ తృప్తి దక్కనివ్వండి తండ్రీ. ఎప్పుడైనా ఇదే పార్కులో కనబడితే కళ్ళెత్తి నా వంక ఓ పాలి సూడండి. బాగున్నవా సింవాచెలం అంటూ ఒక్కమాట అనండి ! నాకంతే సాలు బాబూ ! అంతే సాలు."

నేను వద్దంటున్నా వినకుండా, అయిదు రూపాయల కాగితం నా చేతిలో పెట్టేసి పార్కు బయటకు చరచరా వెళ్లిపోయాడు సింహాచలం.

నేను సిమెంటు బెంచీ మీద శిలా విగ్రహంలా ఉండిపోయాను. మనసు మాత్రం మజ్జిగలో చిలికిన వెన్నపూసలా ఉంది. ఆ వెన్నపూస కరిగి ప్రవహించినట్టుగా నా కళ్లలో తడి. కేవలం పొడి కళ్లతోనే సింహాచలం రూపం చూశాను. అతడ్ని అసహ్యించుకున్నాను. సింహాచలం ఆంతర్యంలో ఎంత ఆర్ద్రత ! ఎంత ఆత్మీయత ! ఎంత తడి ! ఎంత తపన ! ఎంత స్పందన !

మనిషికీ మనిషికీ మధ్య పెరిగిపోతూన్న దూరంలో మనసుకూ మనసుకూ మధ్య పేరుకు పోతూన్న అంతరంలో యాంత్రిక నాగరిక జీవనం పరుగుల్లో క్షణ కాలం, సాటి మనిషి వైపు మనం కన్నెత్తి చూడలేకపోతున్నామా ? మనసు విప్పి మాట్లాడే సమయం, సహనం కోల్పోతున్నామా? ఎక్కడికి పోతున్నాం మనం ?

"డాడీ ! పదండి ! ఇంటికి పోదాం !" పిల్లలిద్దరూ చెరో రెక్కా పట్టుకుని కుదుపుతూంటే తుళ్లిపడి లేచాను.

"రేపు మళ్ళీ పార్కుకు రావాలి. రేపే కాదు. ప్రతీ రోజూ రావాలి ! ఈసారి సింహాచలంతో మనసు విప్పి మాట్లాడాలి. ఒక ఆత్మీయుడుగా అతడ్ని తన ఇంటికి తీసుకు వెళ్ళాలి !" ఒక నిర్ణయానికొచ్చి పిల్లలతో పార్కు బయటకు నడిచాను.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక
సంక్రాంతి సంచిక 15-1-1992